సాక్షి
జగిత్యాల

శనివారం । 20 । జనవరి । 2024



పీఆర్టీయూ డైరీ ఆవిష్కరణ

జగిత్యాల: పీఆర్టీయూ టీఎస్ డైరీని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆవిష్కరించారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బి. ఆనందరావు పాల్గొన్నారు.



రామయ్య నడిచిన 'తాట్లవాయి'

రాయికల్ మండలం తాట్లవాయి గ్రామంలోని అటవీప్రాంతంలో వెలసిన సీతారాముల ఆలయం.. దాని విశిష్టత, రామబాణంతో తీసిన లొంక తదితర అంశాలతో కథనం. 8లో▸

గరిష్టం/కనిష్టం
31.0/19.0

వాతావరణం

జిల్లాలో నేడు వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఉంటుంది. రాత్రి చలి తీవ్రత కొనసాగుతుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఘనంగా భరణి నక్షత్ర వేడుకలు



ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకుడు

ధర్మపురి: ధర్మపురి లక్ష్మీనృసింహస్వామి అనుబంధ యమధర్మరాజు ఆలయంలో శుక్రవారం భరణి నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేదపండితులు ముత్యాలశర్మ మంత్రోచ్చారణలతో స్వామివారికి రుద్రాభిషేకం, మన్యసూక్తం, ఆయుష్యసూక్తంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఆయుష్య హోమంహారతి, మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

రెండోరోజు వేద పారాయణం



ధర్మపురిలో వేద పారాయణం నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలోని శేషప్ప కళావేదిక ఆవరణలో నిర్వహిస్తున్న ప్రేమిక వరద పరిపాలన సభ శుక్రవారం రెండోరోజు కొనసాగింది. 21మంది వేదపండితులతో ఉదయం నుంచి సాయంత్రం వరకు రుగ్వేదహవనం, సామవేద పారాయణం, శ్రీకృష్ణ యజుర్వేద పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఈవో శ్రీనివాస్, వేద పండితులు పాల్గొన్నారు.


ఆదాయ పన్ను రద్దు చేయాలి



ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న పెన్షన్‌దారులు

కోరుట్ల: కేంద్ర ప్రభుత్వం పెన్షన్‌దారులను ఆదాయపు పన్ను నుంచి మినహాయించాలని కోరుతూ తెలంగాణా పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కోరుట్ల ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ.. పదవీవిరమణ పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులను ఆదాయ పన్ను నుంచి మినహాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, సహాయ అధ్యక్షుడు పి.హన్మంతరెడ్డి, ఉపాధ్యక్షుడు ఎండీ. యాకూబ్, కోరుట్ల డివిజన్‌శాఖ అధ్యక్షుడు పబ్బా శివానందం, కార్యదర్శి గంటేడి రాజ్‌మోహన్ పాల్గొన్నారు.

గల్ఫ్ ఇంటర్వ్యూల్లో పోలీసుల తనిఖీలు



వివరాలు సేకరిస్తున్న ఎస్సై

జగిత్యాలక్రైం: జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట గ్రామ శివారులోని కల్యాణమండపంలో శుక్రవారం మధ్యాహ్నం గల్ఫ్ ఇంటర్వ్యూలు జరుగుతుండగా రూరల్‌ఎస్సై సదాకర్ తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి లైసెన్స్ ద్వారా గల్ఫ్ ఇంటర్వ్యూలు చేస్తున్నట్లు వారు చెప్పడంతో వారి వద్దనున్న లైసెన్స్‌తో పాటు, రికార్డులు రూరల్ సీఐ ఆరీఫ్ అలీఖాన్ పరిశీలించారు. లైసెన్స్ ఉన్నట్లు నిర్ధారణ కావడంతో అనుమతించారు.

వికసిత్ భారత్‌పై అవగాహన

మేడిపల్లి: మండలంలోని కల్వకోటలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా పోషణ్ అభియాన్, అన్నప్రాసన, అక్షరాభ్యాసం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావు క్యాలెండర్ ఆవిష్కరించారు. సర్పంచ్ అదే హన్మక్క, ఎంపీటీసీ ఆదిరాజన్న, అధికారులు, ఆశ వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పక్కపక్కనే భూములు ధరల్లో తేడాలు!

- అటు రూ.4,100.. ఇటు రూ.400
- బైపాస్ నష్టపరిహారంలో భారీ వ్యత్యాసం
- విలీన గ్రామంలో మారని భూముల ధరలు
- న్యాయం చేయాలంటున్న ఆర్మూర్– జగిత్యాల– మంచిర్యాల బైపాస్ నిర్వాసితులు



ఎన్‌హెచ్ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న ఎఖీన్‌పూర్, కోరుట్ల రైతులు

కోరుట్ల: పక్కపక్కనే భూములు.. ప్రభుత్వం నిర్ణయించిన ధరల్లో మాత్రం భారీ తేడాలు. ఎందుకంటే ఓ వైపు పాత కోరుట్ల మున్సిపల్ పరిధి. మరో వైపు విలీన గ్రామం ఎఖీన్‌పూర్ హద్దుల్లోని భూములు. ఆరేళ్ల క్రితం ఎఖీన్‌పూర్ కోరుట్ల మున్సిపల్‌లో విలీనమైంది. ఇప్పటిదాకా ఎలాంటి చిక్కులేదు. ఇప్పుడు బైపాస్ రోడ్డురూపంలో సమస్య వచ్చిపడింది. కోరుట్ల–ఎఖీన్‌పూర్ సరిహద్దుల్లో ఉన్న భూములకు రిజిస్ట్రేషన్‌శాఖ నిర్ణయించిన ధరలు ఎఖీన్‌పూర్ సర్వేనంబర్లలో తక్కువగా ఉండగా, కోరుట్లకు ఐదురెట్లు అధికంగా ఉన్నాయి. ఫలితంగా బైపాస్‌లో భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం చెల్లింపులో భారీ తేడాలు వచ్చే అవకాశముంది.

బైపాస్ తెచ్చిన చిక్కు

ఆర్మూర్– జగిత్యాల– మంచిర్యాల బైపాస్ నిర్మాణంలో భాగంగా కోరుట్ల మున్సిపల్‌లో విలీనమైన ఎఖీన్‌పూర్ గ్రామపంచాయతీ పరిధిలో సుమారు 70మంది భూములు కోల్పోతున్నారు. ఎఖీన్‌పూర్ భూములకు కోరుట్ల పాత సరిహద్దుల్లో ఉన్న భూములతో సమానంగా వేములవాడ రోడ్డు వెంట ఉన్న దూరాన్ని బట్టి ప్రయివేటు మార్కెట్‌లో గుంటకు రూ.2లక్షల నుంచి రూ.5లక్షల వరకు ధర పలుకుతోంది. ఈ లెక్కన ఎకరాకు రూ.కోటి ఉంటోంది. కోరుట్ల మున్సిపాలిటీలో విలీనం అయినప్పటి నుంచి ఎఖీన్‌పూర్ భూములకు ధరలు పెరిగాయి.కానీ మార్కెట్ ధరలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్‌శాఖ నిర్ణయించిన ధర మారలేదు.

పరిహారంలో భారీ తేడాలు

ప్రస్తుతం కోరుట్ల–ఎఖీన్‌పూర్ సరిహద్దుల్లో ఉన్న భూములకు కోరుట్ల వైపు ఉన్న భూమి రిజిస్ట్రేషన్ ధర గజానికి రూ.4,100 ఉండగా, ఎఖీన్‌పూర్ వైపు ఉన్న రిజిస్ట్రేషన్.ధర గజానికి రూ.400 మాత్రమే ఉంది. బైపాస్ రోడ్డు అధికారులు రిజిస్ట్రేషన్ ధరను అనుసరించి నష్టపరిహారం చెల్లిస్తారు. ఈ లెక్కన ఎఖీన్‌పూర్‌లోని ఎకరం భూమికి ఎన్‌హెచ్ అధికారులు కేవలం రూ.6 లక్షల వరకు పరిహారం చెల్లించాల్సి ఉంటుంది. పాత కోరుట్ల సరిహద్దుల్లో ఉన్న భూములకు ఎకరానికి రూ.25లక్షల మేర నష్టపరిహారం వస్తుంది. అసలే భూములు కోల్పోతున్నామని ఆవేదనతో ఉన్న ఎఖీన్‌పూర్ రైతులు మున్సిపాలిటీలో కలిసిన తరువాత ప్రభుత్వ నిర్ణీత ధరను రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులు మార్చకపోడంతో ఆందోళన చెందుతున్నారు.

బాధ్యులెవరో?

ఎఖీన్‌పూర్ గ్రామ పంచాయతీ విలీనం గెజిట్‌ను ఆధారంగా చేసుకుని కోరుట్ల శివారుల్లో ఉన్న భూములతో సమానంగా రిజిస్ట్రేషన్ ధరను పెంచితే ఈ సమస్య రాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రెవెన్యూ, రిజిస్ట్రేషన్‌శాఖ అధికారుల ఏమరుపాటు ఫలితంగా ఎఖీన్‌పూర్ కోరుట్ల మున్సిపల్‌లో విలీనమై ఆరేళ్లు గడుస్తున్నా రెవెన్యూ, రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులు భూముల ధరలు మార్పుపై దృష్టి పెట్టలేదు. ఫలితంగా బైపాస్ నష్టపరిహారం చిక్కువచ్చిపడింది. శుక్రవారం బైపాస్‌రోడ్డులో భూములు కోల్పోతున్న ఎఖీన్‌పూర్ రైతులు తమ విలువైన భూములు పోకుండా అలైన్‌మెంట్ మార్చాలని, లేకుంటే నష్టపరిహారం కోరుట్ల మున్సిపల్ భూములతో సమానంగా లెక్కించాలని కోరుతూ మంచిర్యాల జాతీయ రహదారి కార్యాలయంలో బైపాస్‌రోడ్డు ప్రాజెక్టు అధికారికి వినతిపత్రం ఇచ్చారు.

న్యాయం చేయాలి



బైపాస్‌రోడ్డులో నా భూమి పోతోంది. ఎఖీన్‌పూర్ పంచాయతీ రిజిస్ట్రేషన్ ధర ప్రకారం నాకు తక్కువ పరిహారం వస్తుంది. పక్కనే ఉన్న కోరుట్ల సరిహద్దు భూమికి నా కన్నా నాలుగింతలు ఎక్కువ పరిహారం వస్తుంది. కోరుట్ల మున్సిపాలిటీలోనే ఉన్న పక్కపక్క భూములకు ఈ తేడాలు ఉండటంతో తీవ్ర నష్టం జరుగుతుంది. దీన్ని అధికారులు సరిచేసి న్యాయం చేయాలి.

– చిట్యాల నర్సయ్య, ఎఖీన్‌పూర్

బైపాస్ భూ సర్వే అడ్డగింత



సర్వేను అడ్డుకుంటున్న రైతులు

మెట్‌పల్లిరూరల్: బైపాస్ కోసం తమ భూములు తీసుకోవద్దంటూ మెట్‌పల్లి మండలం మేడిపల్లి వద్ద రైతులు భూ సర్వేను అడ్డుకున్నారు. శుక్రవారం మేడిపల్లి శివారులో అధికారులు బైపాస్ ఏర్పాటుకు భూ సర్వే నిర్వహించారు. విషయం తెలుసుకున్న మేడిపల్లి, బండలింగాపూర్, వెల్లుల గ్రామాలకు చెందిన రైతులు అక్కడికి చేరుకుని తక్షణమే సర్వేను ఆపాలని అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో నిర్ణయించిన అలైన్‌మెంట్ ప్రకారమే బైపాస్ నిర్మించాలని, సాధ్యంకాని పక్షంలో జాతీయ రహదారి గుండా నిర్మించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం ఇచ్చే పరిహారం తమకు సరిపోదన్నారు. మెట్‌పల్లి ఆర్డీవో మధు, తహసీల్దార్ శేఖర్ అక్కడికి చేరుకొని సర్వేకు అడ్డుపడొద్దని రైతులను సముదాయించే ప్రయత్నం చేయగా వినకపోవడంతో వెనుదిరిగారు.

అభ్యంతరాలుంటే దరఖాస్తు చేయండి

- ఆర్డీవో నర్సింహమూర్తి
- కరీంనగర్– జగిత్యాల జాతీయ రహదారి అదనపు భూసేకరణలో
- రైతుల నుంచి అభ్యంతరాల స్వీకరణ



ఆర్డీవోకు సమస్యలు విన్నవిస్తున్న రైతులు

మల్యాల: కరీంనగర్– జగిత్యాల ఫోర్‌వే కోసం భూసేకరణలో అభ్యంతరాలుంటే దరఖాస్తు చేసుకోవాలని జగిత్యాల ఆర్డీవో నర్సింహమూర్తి అన్నారు. రహదారి కోసం అదనపు భూసేకరణపై మల్యాలలోని రైతు వేదికలో ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించారు. మండలంలోని ముత్యంపేట, నూకపల్లి, పోతారం, రాజారం గ్రామాల నుంచి జాతీయ రహదారి 563విస్తరణ కోసం గతంలో భూసేకరణ చేపట్టగా, అదనంగా మరో 26ఎకరాల భూ సేకరణ నేపథ్యంలో రైతులతో ఆర్డీవో సమావేశం నిర్వహించారు. రైతులకు అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే నివృత్తి చేస్తామని సూచించారు. ఇప్పటికే కోట్లాది విలువైన భూములు వరదకాలువ, రైల్వేలైను కోసం కోల్పోయామని, మరోమారు అదనపు భూసేకరణ పేరిట భూములు లాక్కుంటున్నారని పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బహిరంగ మార్కెట్ ధరకు అనుగుణంగా పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నిబంధనల ప్రకారం సర్వే చేపట్టి, భూ యజమానులవారిగా నివేదిక రూపొందించి, పరిహారం చెల్లిస్తామని ఆర్డీవో వివరించారు. కార్యక్రమంలో మల్యాల తహసీల్దార్ మునీందర్, ఆర్ఐ తిరుపతి, బార్గవ్, రైతులు పాల్గొన్నారు.

రైతులు చట్టాలను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ధర్మపురి జూనియర్ సివిల్ జడ్జి శ్యామ్ ప్రసాద్

వెల్గటూర్ : రైతులు చట్టాలను వినియోగించుకోవాలని ధర్మపురి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి శ్యాంప్రసాద్ అన్నారు. శుక్రవారం వెల్గటూర్ మండలం కోటిలింగాల గ్రామంలో న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు సైబర్ నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా సూచించారు. లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఎవరికైనా ఉచిత న్యాయ సాయం అవసరమైతే లీగల్ కౌన్సిల్ ద్వారా అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో ధర్మపురి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం సత్యనారాయణరెడ్డి, న్యాయవాదులు లింగారెడ్డి, రౌతు రాజేశ్, బందెల రమేశ్, రామడుగు రాజేశ్, గూడ జితేందర్ రెడ్డి, అలుక వినోద్, కస్తూరి శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ బీఎస్.లత



అధికారులతో మాట్లాడుతున్న లత

జగిత్యాల: జిల్లాలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ బీఎస్.లత అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాలకు సంబంధించిన కార్యక్రమాలు, ప్రజాపాలనకు సంబంధించిన శకటాలు, స్టాల్స్ ఏర్పాటు చేసేలా చూడాలని ఆదేశించారు. నూతన ప్రభుత్వం ఏర్పాటైన మొదటిసారిగా గణతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకుంటున్నామని, ఇంతకుముందు లాగా కాకుండా మార్పులు, చేర్పులుంటాయని, పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు శాఖలవారీగా అవార్డు జాబితా తయారుచేయాలని ఆదేశించారు. ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా జనవరి నెలలో ఎంత మంది వీధిబాలలను గుర్తించారని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

29న పాఠశాల విద్యా కమిటీ ఎన్నికలు

- డీఈవో జగన్మోహన్‌రెడ్డి

జగిత్యాల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా కమిటీ ఎన్నికలు ఈనెల 29న జరుగుతాయని డీఈవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని యజమాన్యాల పాఠశాలలతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పాఠశాలల్లో నూతన పాఠశాల యజమాన్య కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. ఈనెల 20న ప్రతీ పాఠశాల నోటీస్‌బోర్డుపై వివరాలను ప్రకటించాలని అన్నారు. 1–8వ తరగతి చదివే విద్యార్థుల తల్లిదండ్రులు పోటీకి అర్హులని తెలిపారు. ప్రతీ తరగతి నుంచి తల్లిదండ్రులు ముగ్గురు చొప్పున సభ్యులుగా ఉండాలని, ఎన్నికల క్రమంలో మహిళలకు 2/3 వంతు అవకాశం ఇవ్వాలన్నారు. అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ఎక్స్‌అఫిషియో మెంబర్స్ 6, మెంబర్ కన్వీనర్‌గా హెచ్ఎం, నామినేట్ చేయబడిన ఉపాధ్యాయులు, వార్డుమెంబర్, పాఠశాల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్త, పాఠశాల ఆవాస ప్రాంతంలోని ఏఎన్ఎం, సంబంధిత గ్రామ, వార్డు మహిళ అధ్యక్షురాలు, సంఘ సభ్యులు ఇద్దరు, స్వచ్ఛందసేవా సంస్థ ప్రతినిధి, పాఠశాల పూర్వ విద్యార్థుల నుంచి ఇద్దరిని ఎస్ఎంసీ సభ్యులుగా ఎన్నుకుంటారన్నారు. ఈ విద్యాకమిటీ పదవీకాలం రెండు సంవత్సరాలు ఉంటుందని, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఎన్నికలకు ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలని సూచించారు.

స్వీప్ ద్వారా విస్తృత ప్రచారం చేయాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్



మాట్లాడుతున్న కలెక్టర్‌యాస్మిన్ బాషా

జగిత్యాల: ఓటరు నమోదు కార్యక్రమానికి స్వీప్ ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఓటరు దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలన్నారు. జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారందరినీ ఓటరు జాబితాలో నమోదు చేసుకునేలా చూడాలన్నారు. ఓటరు ముసాయిదాపై ఈ నెల 22 వరకు అభ్యంతరాలు స్వీకరించి, ఫిబ్రవరి 2లోపు అభ్యంతరాలు పరిష్కరించి, 8న తుది ఓటరు జాబితా రూపొందించాలన్నారు. కలెక్టర్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ.. ప్రత్యేక ఓటరు కార్యక్రమం చేపట్టడం జరిగిందని, జనవరి 20, 21 తేదీల్లో రెండురోజుల పాటు నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదులో బూత్‌స్థాయి అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్లు దివాకర, లత, ఆర్డీవోలు మధు, నర్సింహమూర్తి పాల్గొన్నారు.

వేడుకలు విజయవంతం చేయాలి

బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా జనవరి 24న జాతీయ బాలల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. కార్యక్రమంలో భాగంగా మొదటి రోజున సంతకాల సేకరణ, అనంతరం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించడం జరుగుతుందని అన్నారు. ఈనెల 20న ప్రత్యేక గ్రామసభలు ఏర్పాటు చేసి పిల్లల లింగనిష్పత్తి, బాలలకు, మహిళలకు సంబంధించి అవగాహన సదస్సులు నిర్వహించాలని అన్నారు. 22న ప్రభుత్వ పాఠశాలల్లో ఆడపిల్లలకు క్రీడాపోటీలు నిర్వహించాలని సూచించారు. వ్యాసరచన, చిత్రలేఖనంపై సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటుచేయాలన్నారు. 23న కమ్యూనిటీ మీటింగ్స్ ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. 24న వివిధపోటీల్లో ప్రతిభ కనబర్చిన బాలికలకు ప్రోత్సహకాలు అందించాలని తెలిపారు.

సత్వరమే సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న జంగయ్య

జగిత్యాల: ఉపాధ్యాయుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం జగిత్యాలలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు వెంటనే చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌సుందర్, శ్రీనివాస్, బన్న, ఆగమయ్య తదితరులు పాల్గొన్నారు.

విభజన హామీలు అమలు చేయాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మోహన్‌రెడ్డి

మెట్‌పల్లి: రాష్ట్ర విభజనకు సంబంధించిన హామీలను కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని తెలంగాణ జన సమితి రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కంతి మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. విభజన హామీల విషయంలో కేంద్రం వైఖరిని నిరసిస్తూ ఈనెల 21వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే సదస్సుకు సంబంధించిన పోస్టర్లను పట్టణంలో శుక్రవారం ఆవిష్కరించారు. హామీలు అమలు చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కార్యక్రమంలో చింతకుంట శంకర్, రెబ్బాటి మల్లయ్య, కంతి రమేశ్, పసునూరి శ్రీనివాస్, వన్నెల శశి పాల్గొన్నారు.

సాగునీటి సమస్య పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న విప్ లక్ష్మణ్‌కుమార్, చిత్రంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్

వెల్గటూర్ : ఎండపల్లి మండలంలోని కొండాపూర్‌లో సాగునీటికి శాశ్వత పరిష్కారం చూపిస్తామని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఎండపల్లి మండలంలోని కొండాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయాన్ని శుక్రవారం చెన్నూరు ఎమ్మెల్యే జి.వివేక్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే ఆరు గ్యారంటీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిధి పెంపు వంటి పథకాలు అమలు చేయడం జరిగిందని తెలిపారు. త్వరలోనే మిగితా హామీలు అమలు చేసి, పేద ప్రజలందరికీ న్యాయం చేస్తామని తెలిపారు. ఎండపల్లి మండలం కొండాపూర్ గ్రామంలో ఉన్న ప్రతీ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ధర్మపురి, వెల్గటూర్, గొల్లపల్లి మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనబట్ల దినేశ్, తాటిపర్తి శైలేందర్ రెడ్డి, ముస్కు నిశాంత్‌రెడ్డి, ఎంపీపీ లక్ష్మి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు నీరందిస్తాం: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్: యాసంగిలో ఆయకట్టు చివరి భూములకు సాగునీరు అందించకపోతే రైతులు ఇబ్బందులు పడతారని, చివరి భూములకు సైతం ఎక్కువమొత్తంలో సాగునీరు అందించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఎస్సారెస్పీ అధికారులకు సూచించారు. బీర్‌పూర్ మండలం కొల్వాయి, తుంగూర్ గ్రామాలకు సాగునీరు అందించే ఆర్‌వీ–2ఎల్ కాలువను శుక్రవారం పరిశీలించారు. 2ఎల్ కాలువలో పూడిక తీత పనులు ముగియగానే శిథిలావస్థలో ఉన్నచోట మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. రొల్లవాగు ప్రాజెక్టును పరిశీలించి 0.25 టీఎంసీ నీరు నిల్వ ఉండేలా చర్యలు తీసుకుంటాని అన్నారు. తద్వారా అటవీశాఖ పరిధిలోని చెట్లు మునిగే అవకాశం ఉందని, ఇందుకు అటవీశాఖ ప్రాజెక్టుకు గేట్లు బిగించడానికి అనుమతించాలని ఆయన డీఎఫ్‌వో వెంకటేశ్వర్‌రావుకు ఫోన్ ద్వారా సూచించారు. అనంతరం సారంగాపూర్, పోతారం, బట్టపల్లి గ్రామాలకు సాగునీరందించే డీ–53,12ఎల్,1ఆర్ కాలువ, పోసానుకుంటను పరిశీలించి పోసానుకుంటను తక్షణమే నింపాలని ఈఈ నారాయణరెడ్డిని కోరారు. ఎంపీపీ మసర్తి రమేశ్, జెడ్పీటీసీ పాత పద్మ, విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు, వైస్‌ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు కొండ్ర రాంచంద్రారెడ్డి, చెర్పూరి సుభాష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వృద్ధురాలి ఆత్మహత్య



ముస్తాబాద్‌(సిరిసిల్ల): మతిస్థిమితం సరిగ్గా లేని వృద్ధురాలు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై శేఖర్‌ కథనం మేరకు వివరాలు. ముస్తాబాద్‌ మండలం తెర్లుమద్దికి చెందిన తొవిటి లక్ష్మి(56) శుక్రవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కూలీ పనులు చేసుకునే తొవిటి లక్ష్మి, చంద్రయ్య దంపతులకు ఇద్దరు కుమారులు. వారికి వివాహాలు జరిగాయి. వృద్ధ దంపతులు వేరే ఇంట్లో ఉంటున్నారు. కొద్దిరోజులుగా మతిస్థిమితం సరిగ్గా లేని లక్ష్మిని ఆస్పత్రులకు తీసుకెళ్తున్నారు. ఈక్రమంలో భర్త ఇంట్లో లేని సమయంలో లక్ష్మి చీరతో ఉరివేసుకుంది. గమనించిన చుట్టుపక్కల వారు లక్ష్మిని ముస్తాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందింది. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భూ వివాదంతో ఆత్మహత్యాయత్నం

- చికిత్స పొందుతున్న దంపతులు



జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం దమ్మన్నపేట గ్రామంలో భూ వివాదంలో తమకు అన్యాయం జరుగుతోందని ఓ వ్యక్తి పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. దమ్మన్నపేట గ్రామానికి చెందిన ఆకుల రాములు రాజారం గ్రామంలో గతంలో రెండెకరాల భూమి కొనుగోలు చేశాడు. మరో వ్యక్తి ఆ భూమి తనదంటూ వచ్చాడు. ఈ విషయమై ఇరువర్గాలు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు. గురువారం తాము సాగుచేసుకుంటున్న పొలం వద్దకు మరో వ్యక్తి వచ్చి రాములుపై దాడిచేశాడు. మనస్తాపానికి గురైన రాములు పొలంలోనే పురుగుల మందు తాగాడు. అడ్డుకోబోయిన ఆయన భార్య నోట్లో కూడా పురుగుల మందు పడింది. దీంతో ఇద్దరిని బంధువులు జగిత్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు.

రెండు మద్యం దుకాణాలు సీజ్‌ చేయాలి

- ఎక్సైజ్‌ అధికారులకు రైతు ఫిర్యాదు



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్లగొల్లపల్లి శివారులో ఏర్పాటు చేసిన రెండు మద్యం దుకాణాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కిష్టంపల్లికి చెందిన రైతు పయ్యావుల దేవయ్యయాదవ్‌ శుక్రవారం ఎక్సైజ్‌ అధికారులకు ఫిర్యాదు చేశారు. రైతు మాట్లాడుతూ రాచర్లజూనియర్‌ కళాశాలకు అతి సమీపంలో ఒకటి, పొలాల వద్దకు వెళ్లే దారిలో మరొకటి ఉన్నాయన్నారు. వైన్స్‌షాపులకు కిలోమీటర్‌ దూరంలో మద్యం సేవించేందుకు నిర్వాహకులు ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. మద్యం తాగేవారితో వ్యవసాయ పొలాల వద్దకు పనులకు వెళ్లడానికి మహిళలు ఇబ్బందులు పడుతున్నారని ఎక్సైజ్‌ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఈ రెండు వైన్స్‌ దుకాణాలను సీజ్‌ చేయాలని ఎక్సైజ్‌ సీఐ ఎంపీఆర్‌ చంద్రశేఖర్‌ను కోరారు.

రామయ్య నడిచిన 'తాట్లవాయి'



తాట్లవాయిలో ఎత్తయిన కొండపై రామయ్య ఆలయం



సీతారామ లక్ష్మణులు



రాములవారు విడిచిన బాణంతో ఏర్పడిన లొంక

- తాట్లవాయిలో అడవుల్లో శ్రీరాముని అడుగులు
- రాములవారి బాణంతో ఏర్పడిన లొంక
- లొంకలోని నీటిని తీసుకెళ్తున్న రైతులు
- ఏటా వైభవంగా సీతారాముల కల్యాణం

రాయికల్‌: ఎటు చూసినా రామనామమే.. ఏ నోట విన్నా శ్రీరామ జపమే.. జై శ్రీరాం నినాదాలతో భారతదేశం మార్మోగుతోంది. అయోధ్యలో రాములవారి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న సీతారాముల ఆలయాలకు ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ క్రమంలో జగిత్యాల జిల్లా రాయికల్‌ మండలం తాట్లవాయి గ్రామంలోని అటవీప్రాంతంలో వెలసిన సీతారాముల ఆలయం .. దాని విశిష్టత, రామబాణంతో తీసిన లొంక తదితర చారిత్రక అంశాలతో కథనం..

తాట్లవాయి అడవుల్లో రాములోరి అడుగులు

రాయికల్‌ పట్టణానికి సుమారు 15 కి.మీ దూరంలో తాట్లవాయి గ్రామం ఉంటుంది. త్రేతాయుగంలో శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు వనవాసంలో భాగంగా రాయికల్‌ మండలం తాట్లవాయి గ్రామంలోని అటవీ ప్రాంతానికి వచ్చారు. ఎత్తయిన అటవీ ప్రాంతంలో సేద తీరడం కోసం ఎలాంటి నిర్మాణం లేకపోవడంతో సీతారాములు గుహలో ఉన్నారు. తాగడానికి ఎత్తయిన ప్రదేశంలో ఎలాంటి నీరు లభించకపోవడంతో ఈ గుహలోకి రామబాణం సంధించగా ధర్మపురి గోదావరి నుంచి నీరు వచ్చినట్లు ఇక్కడి ఇతిహాసంగా చెప్పుకుంటారు. రాములోరు అడుగిడిన ప్రాంతం కాబట్టి స్థానికులు ఆలయం నిర్మించారు. శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడి విగ్రహాలు ప్రతిష్ఠించారు. యేటా శ్రీరామ నవమి సందర్భంగా ఎత్తయిన కొండపై పాదరక్షలు లేకుండా రాళ్లు, రప్పల మధ్య నడుచుకుంటూ వెళ్లి రాములవారిని దర్శించుకుని లొంకలో ఉన్న నీటిని తీసుకెళ్లి తమపంట పొలాల్లో వేసుకుంటే పంటలు సమృద్ధిగా పండుతాయని ఇక్కడి భక్తుల నమ్మకం.

అయోధ్య రాముడు... ఉప్పుమడుగు సీతమ్మ



రామయ్య ఎదుర్కోళ్లు (ఫైల్‌)

అయోధ్య అనగానే శ్రీరాముడి జన్మస్థలమే గుర్తు వస్తుంది. రాయికల్‌ మండలంలోనూ అయోధ్య ఉంది. శ్రీరామనవమి సందర్భంగా అయోధ్య నుంచి రాముడు, పక్కనే ఉన్న ఉప్పుమడుగు గ్రామం నుంచి సీతమ్మను ఊరేగింపుగా తీసుకువచ్చి కల్యాణం కనువిందుగా జరపడం దశాబ్దాలుగా వస్తున్న ఆనవాయితీ. ఈ గ్రామాల మీదుగా శ్రీరాముడు నడిచి వెళ్లినట్లు ప్రచారం ఉంది.

రాముడు బసచేశాడు



మా గ్రామంలోని దట్టమైన అటవీప్రాంతంలో వనవాసంలో భాగంగా శ్రీరాముడు, లక్ష్మణుడు, సీతాదేవీ వచ్చి బస చేసినట్లు ఇక్కడ ఆనవాళ్లు ఉన్నాయి. తాగునీటి కోసం రాముడు బాణంతో నేల బొయ్యారం ఉండగా ఏ కాలంలోనైనా ఇందులో నీరు ఉండటం విశేషం.

– శ్యాంసుదరాచార్యులు, అర్చకుడు, తాట్లవాయి

మా అదృష్టం



తాట్లవాయి గ్రామంలో శ్రీరాముడు అడుగుపెట్టడం మా గ్రామస్తులందరి అదృష్టం. ఏటా శ్రీరామనవమి సందర్భంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. 22న అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మరోసారి తాట్లవాయి రాముడుపై చర్చ నెలకొంది.

– ఆకుల గంగారెడ్డి, తాట్లవాయి

నేడు గ్రూప్స్‌ ఉచిత శిక్షణ దరఖాస్తుకు చివరి తేదీ

కరీంనగర్‌: స్థానిక బీసీ స్టడీసర్కిల్‌ ఆధ్వర్యంలో గ్రూప్‌–1, 2, 3, 4 ఫౌండేషన్‌ కోర్సులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు స్టడీ సర్కిల్‌ డైరెక్టర్‌ రవికుమార్‌ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సంబంధిత వెబ్‌సైట్‌లో శనివారంలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. డిగ్రీ అర్హత కలిగిన ఉమ్మడి కరీంనగర్‌ జిల్లా నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.5 లక్షలకు మించరాదన్నారు. దరఖాస్తుతోపాటు ఎస్సెస్సీ, ఇంటర్‌, డిగ్రీ సర్టిఫికెట్లు, ఇటీవల తీసుకున్న కుల, ఆదాయ ధ్రువపత్రాలు, ఆధార్‌ కార్డు, ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్‌ చేయాల్సి ఉంటుందని తెలిపారు. అభ్యర్థుల ఎంపిక రిజర్వేషన్‌, డిగ్రీలో వచ్చిన మార్కుల ఆధారంగా ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 0878–2268686 ఫోన్‌ నంబర్‌లో, కరీంనగర్‌ బీసీ స్టడీ సర్కిల్‌ కార్యాలయ నూతన భవనంలో ఆఫీసు వేళల్లో సంప్రదించాలని సూచించారు.

క్రికెట్‌కు ఉన్న క్రేజ్‌ ఏ క్రీడకూ లేదు

- ఒలింపిక్‌ సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌ రెడ్డి
- హోరాహోరీగా యూనిటీ కప్‌–2024 క్రికెట్‌ లీగ్‌



పరిచయం చేసుకుంటున్న జనార్దన్‌ రెడ్డి

కరీంనగర్‌ స్పోర్ట్స్‌: ప్రస్తుత కాలంలో క్రికెట్‌కు ఉన్నంత క్రేజ్‌ ఏ క్రీడకూ లేదని, జిల్లాలో క్రీడాకారులు భవిష్యత్‌లో భారత జట్టుకు ప్రాతినిథ్యం వహించాలని ఒలింపిక్‌ సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌ రెడ్డి అన్నారు. కరీంనగర్‌లోని అంబేడ్కర్‌ స్టేడియం, ఎస్సారార్‌ కళాశాల మైదానంలో యూనిటీ కప్‌–2024 క్రికెట్‌ లీగ్‌ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం స్టేడియంలో జరిగిన మొదటి క్వార్టర్‌ ఫైనల్‌ మ్యాచ్‌ను ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకొని, ప్రారంభించారు. కరీంనగర్‌లో క్రికెట్‌ స్టేడియం ఏర్పాటు చేయాలని హెచ్‌సీఏ, బీసీసీఐలను కోరనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను వెలుగులోకి తీసుకువస్తున్న టోర్నమెంట్‌ నిర్వాహకులను అభినందించారు. కరీంనగర్‌ క్రికెట్‌ క్లబ్‌ అధ్యక్షుడు యాదగిరి మాట్లాడుతూ.. విజేత, రన్నరప్‌ జట్లకు భారీ ప్రైజ్‌మనీ అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్‌ క్రికెట్‌ క్లబ్‌ కార్యదర్శి ప్రసాద్‌, సుల్తానాబాద్‌ క్రికెట్‌ క్లబ్‌ కార్యదర్శి మహేందర్‌, కోచ్‌ కన్నన్‌, నిర్వాహకులు సురేశ్‌, మహర్షి, రాజు తదితరులు పాల్గొన్నారు.

రంగోత్సవ్‌ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు



మెడల్స్‌తో కొదురుపాక హైస్కూల్‌ విద్యార్థినులు

బోయినపల్లి(వేములవాడ): రంగోత్సవ్‌ సెలబ్రేషన్స్‌ ముంబై వారు నిర్వహించిన నేషనల్‌ లెవల్‌ ఆర్ట్‌ పోటీల్లో మండలంలోని కొదురుపాక హైస్కూల్‌ విద్యార్థులు సత్తాచాటారు. చేతి రాత, కలరింగ్‌, టాటూ ఆర్ట్‌, కాలేజీ ఆర్ట్‌ విభాగాల్లో మెరిట్‌ అవార్డుతోపాటు 10 గోల్డ్‌, 9 సిల్వర్‌మెడల్స్‌ సాధించినట్లు ఆర్ట్‌ టీచర్‌ కిన్నెర రాజు శుక్రవారం తెలిపారు. గెలుపొందిన విద్యార్థినులను హైస్కూల్‌ హెడ్‌మాస్టర్‌ ఉషారాణి సన్మానించి పతకాలు అందించారు. జాతీయ స్థాయి ఆర్ట్‌ పోటీల్లో నెగ్గిన విద్యార్థినులు అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారని, వారు విజయం సాధించాలని ఆకాంక్షించారు.

కేంద్రంలో బీజేపీని గద్దె దించాలి



మాట్లాడుతున్న రమేశ్‌

కరీంనగర్‌: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు కార్మిక, కర్షకులు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేశ్‌ పిలుపునిచ్చారు. శుక్రవారం కరీంనగర్‌ కోతిరాంపూర్‌లోని ముకుందలాల్‌ మిశ్రాభవన్‌లో సంఘం జిల్లా అధ్యక్షులు గీట్ల ముకుంద రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు వర్ల వెంకట్‌ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు కవ్వంపల్లి అజయ్‌ల అధ్యక్షతన మూడు సంఘాల జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, నల్లధనం వెనక్కి తీసుకొచ్చి, ప్రతీ ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామని చెప్పిన ప్రధాని మోదీ మాట తప్పారన్నారు. ఆయన హయాంలో నిరుద్యోగం 50 ఏళ్ల వెనక్కి వెళ్లిందని ఆరోపించారు. శ్రామిక నిజ వేతనాలు 20 శాతం తగ్గాయని, రూపాయి విలువ పతనం, ధరలు 56 శాతం పెరిగాయన్నారు. కార్పొరేట్‌ కంపెనీలకు రూ.2.14 లక్షల కోట్ల రుణమాఫీ చేశారని మండిపడ్డారు. రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ఎం.వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ.. కేరళ తరహాలో రుణ విమోచన చట్టం తీసుకువచ్చి, రైతులను ఆదుకోవాలని డిమాండ్‌ చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్‌ మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల కోసం శ్రీరాముడిని వాడుకుంటున్నారని ఆరోపించారు. ఈ నెల 26న జిల్లా, మండల కేంద్రాల్లో బైక్‌ ర్యాలీలు నిర్వహిస్తామని, ఫిబ్రవరి 15 గ్రామీణ బంద్‌ను విజయవంతం చేస్తామని, ఇంటింటికీ ప్రధాని మోదీ ప్రజా వ్యతిరేక విధానాలపై కరపత్రాలు పంచుతామని పేర్కొన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు యు.శ్రీనివాస్‌, గుడికందుల సత్యం, జనగాం రాజమల్లు, సహాయ కార్యదర్శి పున్నం రవి, మారెళ్ల శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

జమ్మికుంట(హుజూరాబాద్‌): పట్టణంలోని శాలవాడకు చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల వివరాల ప్రకారం.. దిడ్డి రాజేశ్‌(22) తండ్రి కృష్ణ, తల్లి వసంత కుటుంబ కలహాలతో వేరుగా ఉంటున్నారు. తల్లితో కొడుకు రాజేశ్‌, కూతురు సంధ్య ఉంటున్నారు. కుమారుడు తరచూ తల్లిని బెదిరిస్తూ.. డబ్బులు ఇవ్వాలని, వేధించేవాడు. గత సోమవారం తల్లి, చెల్లిని ఇంటి నుంచి వెళ్లగొట్టాడు. శుక్రవారం ఉదయం నల్లా నీరు వస్తోందని కృష్ణ కుమారుడి కోసం చూశాడు. చుట్టుపక్కల వారిని సంప్రదించగా సోమవారం నుంచి కనిపించడం లేదని తెలిసింది. అనుమానం వచ్చి, ఇంటికి వెళ్లి, తలుపులు తీసి చూడగా రాజేశ్‌ ఉరేసుకొని కనిపించాడు. మృతదేహం నుంచి దుర్వాసన వస్తుండటంతో మూడు రోజుల క్రితమే మృతిచెందినట్లు భావిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని ఒకరు..

మేడిపల్లి: మండలంలోని కొండాపూర్‌ గ్రామంలో ఉరివేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. ఏఎస్సై రవీందర్‌రావు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గంగవేణి మహేశ్‌(45) గొర్రెలకాపరి. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో గొర్లు మేపడానికి సరిగా వెళ్లడం లేదు. మద్యం తాగడం మానేసి, గొర్లు మేపేందుకు వెళ్లాలని అతనికి భార్య లక్ష్మి మందలించింది. మనస్తాపం చెందిన మహేశ్‌ ఇంటి సమీపంలోని గొర్లకొట్టం వద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మహేశ్‌కు కొడుకు, కూతురు ఉన్నారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వివరించారు.

పాముకాటుతో బాలుడి మృతి

మానకొండూర్‌: మండల కేంద్రానికి చెందిన ఇస్కుల్లా నవీన్‌ కుమారుడు సుహాశ్‌(3) పాముకాటుతో మృతి చెందాడు. శుక్రవారం ఉదయం ఇంటి ముందు ఆడుకుంటూ ఉండగా పాముకాటు వేసింది, బాలుడి నోటి నుంచి నురగలు రావడం గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే బాలుడు మృతిచెందాడని వైద్యులు తెలిపారు. ఒక్కగానొక్క కొడుకు పాముకాటుతో చనిపోవడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

చొప్పదండి మాజీ ఎమ్మెల్యే భర్త మృతి



గాలన్న (ఫైల్‌)

చొప్పదండి/సైదాపూర్‌(హుస్నాబాద్‌): చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ భర్త గాలన్న(56) అనారోగ్యంతో మృతిచెందారు. వివరాల్లోకి వెళ్తే.. సైదాపూర్‌ మండలంలోని వెంకటేశ్వర్లపల్లి చెందిన శోభ –గాలన్న దంపతులు 1990 దశకంలో నక్సలైట్‌ ఉద్యమంలో పని చేశారు. అప్పుడే ప్రేమ వివాహం చేసుకున్నారు. తర్వాత జన జీవన స్రవంతిలోకి వచ్చి, కొంతకాలం మహాజన సంఘర్షణ సమితిలో చేరి, మంద కృష్ణ మాదిగతో కలిసి పని చేశారు. అనంతరం టీఆర్‌ఎస్‌లో చేరగా, శోభక్క 2001లో శంకరపట్నం జెడ్పీటీసీ సభ్యురాలిగా గెలుపొందారు. 2009 నుంచి 2014 వరకు చొప్పదండి నియోజకవర్గ కేంద్రంగా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. ఆ సమయంలో గాలన్న టీఆర్‌ఎస్‌ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారు. 2014లో శోభ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2018లో బీజేపీలో చేరారు. రెండేళ్లుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న గాలన్న పలు ప్రైవేట్‌ ఆస్పత్రుల్లో చికిత్స పొందినా ఆరోగ్యం నయం కాలేదు. చివరకు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ శుక్రవారం చనిపోయారు. ఆయన మృతి పట్ల మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌ కుమార్‌ సంతాపం వ్యక్తం చేశారు. గాలన్న మృతదేహాన్ని కుటుంబసభ్యులు స్వగ్రామం వెంకటేశ్వర్లపల్లికి తరలించారు. మృతికి రెండు గంటల ముందు సైదాపూర్‌ మండలంలోని వెన్కెపల్లి సహకార సంఘం చైర్మన్‌ కొత్త తిరుపతిరెడ్డి, సర్పంచ్‌ బొడిగె పద్మజ, మండల నాయకులు ఆయనను పరామర్శించారు. శోభ –గాలన్న దంపతులకు ఒక కుమారుడు, కూతురు కాగా, కూతురికి వివాహమైంది.

ఎమ్మెల్సీ కవిత సంతాపం

జగిత్యాల: చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ భర్త గాలన్న మృతికి బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని, ఆ కుటుంబానికి దేవుడు మనోధైర్యాన్ని ఇవ్వాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



సైదాపూర్‌: మండల కేంద్రంలోని పాత బస్టాండ్‌ ప్రాంతంలో శుక్రవారం బైక్‌ను వెనుక నుంచి బొలెరో ఢీ కొనడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో హుజూరాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. క్షతగాత్రుల బంధువులు, స్థానికుల సమాచారం మేరకు వెన్కెపల్లికి చెందిన మ్యాకల ప్రశాంత్‌, ఈరాల రజనీకాంత్‌ బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి బొలెరో ఢీకొట్టింది. బాధితుల నుంచి ఫిర్యాదు రాలేదని ఎస్‌ఐ ఆరోగ్యం తెలిపారు. ప్రమాదానికి కారణమైన బొలెరోను పోలీస్‌ స్టేషన్‌కు తరలించామని, ఫిర్యాదు చేయగానే కేస్‌ నమోదు చేసి దర్యాప్తు చేపడతామని తెలిపారు.

హబ్సీపూర్‌ సర్పంచ్‌ అరెస్ట్‌

సారంగాపూర్‌: జగిత్యాల రూరల్‌ మండలం హబ్సీపూర్‌ సర్పంచ్‌ రాజేశ్వర్‌రెడ్డిని సారంగాపూర్‌ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశా రు. ఎస్‌ఐ తిరుపతి వివరాల ప్రకారం.. హ బ్సీపూర్‌లో వినాయక నవరాత్రుల సమయంలో ఇదే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు మాడెం శివనాగేశ్వర్‌ తండ్రి నిర్వహిస్తున్న కిరాణాదుకాణానికి అర్ధరాత్రి వెళ్లారు. సిగరేట్‌ కావాలని అడిగారు. తలుపులు తీయకపోవడంతో న్యూసెన్స్‌ చేశారు. మరునాడు శివనాగేశ్వర్‌ తండ్రి ఈ విషయమై సర్పంచ్‌ను కలవగా సదరు యువకులకే మద్దతు తెలిపాడు. దీంతో జగిత్యాల రూరల్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై సర్పంచ్‌తో పాటు ముగ్గురు యువకులు శివనాగేశ్వర్‌ కుటుంబాన్ని బెదిరించారు. మనస్తాపం చెందిన శివనాగేశ్వర్‌ గతేడాది సెప్టెంబర్‌ 30న ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ కేసులో హబ్సీపూర్‌కు చెందిన ముగ్గురిని అరెస్టు చేయగా, శుక్రవారం సర్పంచ్‌ రాజేశ్వర్‌రెడ్డిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు చేసినట్లు ఎస్సై వివరించారు.

పొలంలో పడి వ్యక్తి మృతి

వీణవంక: మండలంలోని హిమ్మత్‌నగర్‌ గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ దుకిరే రాజు(32)అనే పొలంలో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఓ ఆసామి వద్దకు నారు మోయడానికి వెళ్లగా ప్రమాదవశాత్తు బురదలో బోర్లపడటంతో ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, మృతుడికి కొడుకు, కూతురు ఉన్నారని తెలిపారు.

బైక్‌ అదుపుతప్పి యువకుడి మృతి

- సంఘటన స్థలంలోనే రాత్రంతా మృతదేహం
- ఎల్లారెడ్డిపేటలో విషాదం



కుమార్‌(ఫైల్‌)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన పెంటం కుమార్‌(30) గురువారం రాత్రి బైక్‌ అదుపుతప్పి అక్కడికక్కడే మృతిచెందాడు. రాత్రి 11 గంటల సమయంలో ప్రమాదం జరిగితే తెల్లావారుజాము వరకు ఎవరూ చూడకపోవడంతో మృతదేహం అక్కడే పడి ఉంది. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేటలో విషాదం నింపింది. శుక్రవారం ఉదయం స్థానికులు మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని కుమార్‌దిగా గుర్తించి బోరున విలపించారు. మృతునికి తండ్రి పద్మయ్య, సోదరుడు ప్రవీణ్‌, భార్య సోని, పిల్లలు చరణ్‌, వర్షిత్‌ ఉన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్‌ తెలిపారు.

ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు అరెస్ట్‌



అరెస్ట్‌ చూపుతున్న పోలీసులు

మెట్‌పల్లి: నియోజకవర్గంలో పలు ఆలయాల్లో దొంగతనాలకు పాల్పడ్డ ముగ్గురు యువకులను అరెస్ట్‌ చేసినట్లు డీఎస్పీ రవీందర్‌రెడ్డి తెలిపారు. మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. మెట్‌పల్లికి చెందిన షేక్‌ హైదర్‌, మోర్తాడ్‌కు చెందిన ఎర్ర వెంకటి, కొర్వ సంతోష్‌ సులభంగా డబ్బులు సంపాదించడానికి ఆలయాల్లో చోరీలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు కోరుట్ల, గోధూర్‌, జగ్గాసాగర్‌, ధర్మారం, రాంలచ్చక్కపేటల్లోని పలు ఆలయాల్లో దొంగతనాలకు పాల్పడ్డారు. ముగ్గురిని ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీ వద్ద అదుపులోకి తీసుకొని, రూ.9వేల నగదు, 14తులాల వెండి, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. వారిని పట్టుకున్న కానిస్టేబుళ్లు కిరణ్‌, సంతోష్‌కు రివార్డు ఇచ్చినట్లు పేర్కొన్నారు. సమావేశంలో సీఐ లక్ష్మీనారాయణ, ఎస్‌ఐ చిరంజీవి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

జగిత్యాల క్రైం: జగిత్యాల రూరల్‌ మండలం పొలాస శివారులో జగిత్యాల–ధర్మపురి ప్రధాన రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతిచెందారు. ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. జగిత్యాలలోని విజయపురికాలనీకి చెందిన దయ్యాల రమేశ్‌(33), బాలెపల్లి గ్రామానికి చెందిన ఏగుర్ల గణేశ్‌ కల్లెడ గ్రామంలో జరిగిన శుభకార్యానికి హాజరయ్యారు. వేర్వేరు బైక్‌లపై తిరిగి ఇంటికి వస్తుండగా పొలాస శివారులో గుర్తు తెలియని వాహనం రెండు బైక్‌లను ఢీకొట్టింది. రమేశ్‌ అక్కడికక్కడే మృతిచెందాడు. గణేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని ఆస్పత్రికి తరలించేందుకు సాయం చేస్తున్న ధర్మపురి మండలం నేరెల్ల గ్రామానికి చెందిన అక్కినపల్లి బాబుకుమార్‌, మామిడిపల్లి సత్తయ్యను గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. బాబుకుమార్‌ కాలుతెగి రోడ్డుపై పడిపోయింది. సత్తయ్యకు తీవ్రగాయాలు అయ్యాయి. వీరిని స్థానికులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రూరల్‌ ఎస్సై సంఘటన స్థలాన్ని చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.





సిరిసిల్లలో వెలుగులు వచ్చాయ్‌..



విద్యుత్‌ బకాయిలు రూ.1.56కోట్లకు పేరుకుపోవడంతో సెస్‌ అధికారులు సిరిసిల్ల బల్దియాలో కరెంటును గురువారం కట్‌ చేసిన విషయం తెలిసిందే. జిల్లా కేంద్రంలో అన్ని వార్డులు, డివైడర్లు, ప్రధాన కూడళ్లు అంధకారంలో ఉండిపోయాయి. దీనిపై ×సాక్షి₹లో శుక్రవారం కథనం ప్రచురితం కావడంతో మున్సిపల్‌, సెస్‌ అధికారులు స్పందించారు. ఇరుశాఖల అధికారులు సమన్వయంతో నిర్ణయానికి వచ్చి.. శుక్రవారం కరెంటు సరఫరాను పునరుద్ధరించారు. దీంతో శుక్రవారం సిరిసిల్ల పట్టణం విద్యుత్‌కాంతుల్లో దేదీప్యమానంగా వెలుగొందుతోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్‌, రాజన్నసిరిసిల్ల